క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



తాడేపల్లి రూరల్: తాడేపల్లి నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మంగళవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 900 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు తాడేపల్లి మండలంలో జీవనం సాగిస్తున్నారని, తమకు వృత్తి శిక్షణకు, నిద్రలు చేయడానికి ఎక్కడా కమ్యూనిటీ హాల్ లేనందున తమ సామాజికవర్గంవారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించవలసినదిగా వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు తెంపల్లి దుర్గారావు, ఉపాధ్యక్షుడు పతకమూరి రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి విజయ్ లక్ష్మణ్, కావూరి నరసింహారావు, కోశాధికారి పాతూరి నాగబాబు, రవి, నాని, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే గుంతే..!



ఫిరంగిపురం: మండలకేంద్రం ఫిరంగిపురం బొడ్రాయి సెంటర్ వద్ద కాలువపై ఉన్న సిమెంటు దిమ్మె పగిలిపోయి గుంత ఏర్పడింది. దీంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రిళ్లు గుంత కనపడక అందులో బైక్‌లు పడిపోయి ప్రమాదాలు జరిగాయి. కొందరు పాదచారులు సైతం అటుగా వెళ్తూ దానిలో పడి గాయాల పాలైన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువ తూముపై ఉన్న గుంత పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

దొండపాడులో రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ: తుళ్లూరు మండలం దొండపాడులో అక్రమంగా తరలిస్తున్న నాలుగు బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కలగయ్య తెలిపారు. సోమవారం రాత్రి దొండపాడు సెంటర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా పెదకూరపాడు మండలం పాటిబండ్ల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తి నాలుగు బస్తాల్లో క్వింటాన్నర రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డ్రెయిన్ల పూడికతీత



పెదపరిమి(తాడికొండ): తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని అధికారులు బయటకు మళ్లించే ప్రక్రియ ప్రారంభించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు శివారు కాలనీలలో డెయిన్‌లు పూడుకుపోయి నీరు బయటకు వెళ్లే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో డ్రెయిన్‌లు పూడికతీత నీటిని బయటకు మళ్లించే పనులు ప్రారంభించినట్లు కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాలలో ఇబ్బందులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే సత్వర పరిష్కారం చేస్తామన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జరిమానా

మంగళగిరి: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు రూ.10 వేల జరిమానా విధించినట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ మంగళవారం తెలిపారు. రూరల్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూరు జంక్షన్‌లో ఈ నెల 25వ తేదీ రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా కొండపల్లి సాయి మణికంఠ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ ఉండగా తనిఖీల్లో పట్టుకుని, మంగళగిరి కోర్టులో హాజరుపరచగా కోర్టు మణికంఠకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

రొటేరియన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

తెనాలి: అన్నదాత సుఖీభవ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బోసురోడ్డులో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. రోటేరియన్ ఆలపాటి కిరణ్ జన్మదినోత్సవ సందర్భంగా ఈ వితరణ చేశారు. సీనియర్ రొటేరియస్ కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్, కొమ్మలపాటి ఆంజనేయులు, జాన్ కీట్స్, బద్రి గిరి, జీవీ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, శికినం వరప్రతాప్ కుమార్, గుడికందుల అర్జున్ రావు, దూళిపూడి శ్రీరామ్‌మూర్తి, డాక్టర్ ఉమ్మలనేని శ్రీనివాసరావు, అంగిరేకుల శివ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అధనపు బాదుడుకు సిద్ధం

- ఎంటీఎంసీ పరిధిలో ప్రజలపై పన్నుల భారం
- రూ 10 కోట్ల ఆదాయం పెంపే లక్ష్యం
- మార్పులు, చేర్పులు చేసిన గృహాలపై అదనపు పన్ను
- కొలతలు తీస్తున్న అధికారులు

మంగళగిరి: అధికారంలోకి వచ్చిన అనంతరం ఆస్తి పన్నులు గత మార్చి నాటికే యాభై శాతం పెంచి ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా మరోసారి ప్రజలపై పన్నుల భారం మోపేందుకు రంగం సిద్ధం చేసింది. మంగళగిరి – తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రజలపై పన్నుల బాదుడుకు కసరత్తు చేస్తుంది. పన్నుల విధింపుపై సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పట్టణ ప్రణాళికా విభాగం ఆదేశాలతో మున్సిపల్ రెవెన్యూ యంత్రాంగం రంగంలోకి దిగింది.



మంగళగిరి ఏరియల్ వ్యూ

రంగం సిద్ధం

గత పది సంవత్సారాలలో కార్పొరేషన్‌లో నిర్మాణ రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఉన్న భవనాలను విస్తరించడం, అదనపు గదులు నిర్మాణాలను యజమానులు చేపట్టారు. ఈ నేపథ్యంలో మార్పులు చేర్పులు చేసిన భవనాలను గుర్తించి వాటికి కొలతలు వేసి అదనపు పన్ను వేసేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో సచివాలయ సిబ్బంది నేతృత్వంలో రెండు అర్బన్ ప్రాంతాలతో పాటు రెండు మండలాల్లోని గ్రామాలను కలిపి 50 డివిజన్లుగా విస్తరించారు. వీటిలో దాదాపు రూ 33 కోట్లు ఆస్తి పన్ను డిమాండ్ కాగా గత బకాయిలతో కలిపి రూ.43 కోట్ల ఆదాయం వుంది. గత ఆర్థిక సంవత్సరంలో పాత బకాయిలు వసూలు చేసినప్పటికీ ఇంకా రూ.9 కోట్లు బకాయిలు వున్నాయి.

మార్పులు, చేర్పులపై దృష్టి

కార్పొరేషన్ పరిధిలో 85,926 గృహాలు వున్నాయి. వీటిలో ఎన్ని భవనాలు, గృహాల్లో మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయనేది అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు పాత పన్నులు అమలు చేస్తూ వస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఆదేశాలతో మున్సిపల్ రెవెన్యూ విభాగం, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా పన్నులు విధించే పనిలో నిమగ్నమయ్యారు. మార్పులు, చేర్పులు చేసిన భవనాల నుంచి సుమారు రూ.7 నుంచి రూ.10 కోట్ల ఆదాయం రాబట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ఖాళీ స్థలాల పన్నులు వసూలు కష్టంగా మారింది. స్థల యజమానులు స్థానికంగా ఉండకపోవడం రెవెన్యూ విభాగానికి ఇబ్బందిగా మారింది. ఇంటి యజమానుల పేర్లను గుర్తించి నిర్ధారించుకోవడంలో జరుగుతున్న జాప్యం కూడా ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. ఈ అర్ధ సంవత్సరంలో భవనాల మార్పులు, చేర్పులు జరిగిన గృహాల నుంచి నిర్దిష్టమైన కొలతలతో ఆస్తి పన్ను వసూలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.



అభివృద్ధి కోసం ఆదాయం పెంచుకోవాలి

మున్సిపల్ కార్పొరేషన్‌కు అన్ని మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి చేయాలంటే కార్పొరేషన్ ఆదాయం పెంచుకోవాల్సి వుంది. మార్పులు చేర్పులు చేసిన గృహాలను గుర్తించి పన్నులు రాబట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. కార్పొరేషన్ త్వరితగతిన విస్తరించడంతో పాటు జనాభా పెరుగుతుంది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో వుంచుకుని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– అలీంబాషా, కమిషనర్ ఎంటీఎంసీ

జవహర్‌లాల్ నెహ్రూకు ఘననివాళి

తాడేపల్లి రూరల్: భారత దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూబొమ్మ సెంటర్‌లో నిర్వహించారు. తొలుత నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం మాట్లాడుతూ నెహ్రూ దేశానికి అందించిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. దేశ తొలి ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని భారత దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారని, పంచవర్ష ప్రణాళిక ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కాపు సాధికార చైర్మన్ రేమిడి శెట్టి హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ చైర్‌పర్సన్ షేక్ మున్ని, తాడేపల్లి మండల అధ్యక్షుడు పఠాన్ సుభాని, మైనార్టీ నాయకులు చాంద్ బాషా, షేక్ జల్ఫి, తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మేడికొండూరు: మండల పరిధిలోని చైల్డ్ రైట్స్ అడ్వేకసీ ఫౌండేషన్– క్రాఫ్ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యాలయం సమావేశ ప్రాంగణంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టాలపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి టి.చందన మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు నిండకుండా, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తారన్నారు. క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.సమీర్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధానికి జీవో ఎం.ఎస్ నంబర్ 31ని కఠినంగా అమలుపరచాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి వివరించారు. ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్, సిరిపురం సెక్టార్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగిన దంపతులకు పుట్టే పిల్లలు శారీరక, మానసిక లోపంతో ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100/112 తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్, మేడికొండూరు సెక్టార్ సూపర్‌వైజర్ టి.హేమలత, చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ – క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.వెంకట్, సిబ్బంది పద్మజ, మేడికొండూరు మండలం పరిధిలోని అన్ని గ్రామ సచివాలయం సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు, పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ టి.చందన

కోర్టు తీర్పులను అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ విషయంలో సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్టు ఇచ్చిన తీర్పులను అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేములు దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులతో కలసి సందర్శించి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులకు ఎవరైనా శిరోధార్యం కావాల్సిందే అని, కానీ ఫ్యాక్టరీ యాజమాన్యం, పాలక పార్టీలు కోర్టులు ఇచ్చిన తీర్పును పాటించడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆంజనేయులు, ప్రశాంత్, ఏడుకొండలు, రిబ్కా, హగ్గయ్య, సుబ్బారావు, ఇస్రాయిల్, ఆశీర్వాదం, ఇమాంబీ, సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

బుల్లెట్ ఢీకొని వ్యక్తికి గాయాలు

తాడికొండ: బుల్లెట్ ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై ఓ వ్యక్తి ఆసుపత్రిలో చేరిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. నిడముక్కల గ్రామానికి చెందిన పఠాన్ గలి సాహెబ్ అనే 56 ఏళ్ల వ్యక్తి అమరావతి – గుంటూరు ప్రధాన రహదారిపై నిడుముక్కలలోని తన ఇంటి ఎదుట రోడ్డు దాటుతుండగా అమరావతి నుంచి గుంటూరు వైపు బుల్లెట్‌పై వస్తున్న యువకుడు స్పీడుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో వృద్ధుడికి ఎడమ మోకాలికి తీవ్ర గాయంకాగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జేత్యా నాయక్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఎండీయూ ఆపరేటర్ల జీవితాలతో చెలగాటం

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటమాడుతోందని ఎండీయూ వాహనాలకు కాలపరిమితి ఉన్నా ఇంటింటికి రేషన్ అందించే వ్యవస్థను రద్దు చేయడం దారుణమని పలువురు ఎండీయూ వాహన డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం అసోసియేషన్ సభ్యులంతా మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మంగళగిరి వడ్లపూడి సెంటర్ నుంచి గౌతమ బుద్ధ రోడ్‌మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. గౌతమ బుద్ధ రోడ్‌పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎండీయూ ఆపరేటర్లు మాట్లాడుతూ 2027 జనవరి వరకు అగ్రిమెంట్లు ఉన్నప్పటికీ వాటిని రద్దు చేసి కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. 2021లో కరోనా వంటి ఉపద్రవంలో కూడా తమ జీవితాలను పణంగా పెట్టి ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా విధులు నిర్వహించి ప్రజలకు రేషన్ అందించామని అన్నారు. ఎండీయూ వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ దినేష్ చంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎంటీఎంసీ ఎండీయూ యూనియన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రవికుమార్, సెక్రటరి వి.రవికుమార్, పలువురు ఎండీయూ వాహన డ్రైవర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



మంగళగిరి తహసీల్దార్ దినేష్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు

విద్యుత్ మోటారు వైర్లు చోరీ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు ఆంజనేయస్వామి గుడివద్ద కార్పొరేషన్ తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మోటార్ల విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున దొంగిలించారు. ఉదయం మోటార్లు ఆన్ చేయడానికి వెళ్లిన సిబ్బంది ఆ విషయాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కార్పొరేషన్ ఏఈ అక్కడకు చేరుకుని కట్‌చేసిన వైర్లను పరిశీలించి వెంటనే కొత్త వైర్లు వేసి, దొంగిలించిన నాలుగు మోటార్ల వైర్లు బిగించారు. సుమారు రూ.10 వేల విలువ చేసే వైర్లు దొంగిలించినట్లు గుర్తించి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల నుంచి తాడేపల్లి పట్టణ పరిధిలో పలు చోట్ల ఇదేవిధంగా దొంగలు సంచరిస్తూ గ్యాస్ సిలెండర్లు, ఇతర వస్తువులను దొంగిలిస్తున్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



శిక్షణా కార్యక్రమంలో పాల్గొని యోగా చేస్తున్న అడిషనల్ కమిషనర్ శకుంతల



ఎస్ఆర్ఐ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు

అడిషనల్ కమిషనర్ శకుంతల

మంగళగిరి టౌన్: యోగాను ప్రతి ఒక్కరు తమ జీవితంలో భాగం చేసుకోవాలని, అప్పుడే ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఈద్గా కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా యోగా శిక్షణ పొందిన మాస్టర్ల ట్రైనర్లచే యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ ఐదు రోజుల పాటు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మంగళగిరినగర పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్‌లో ఉన్న ఈద్గా కమ్యూనిటీ హాల్, తాడేపల్లి సీతానగరంలోని రామకృష్ణ మిషన్ స్కూల్‌లో యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు ఉదయం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఉండవల్లి గుహల వద్ద, జూన్ 3వ తేదీన శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ ప్రాంగణంలో, జూన్ 10వ తేదీన మంగళగిరి ఎకో పార్కులో ఈ యోగా శిక్షణా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. యోగా శిక్షణలో పాల్గొనే వారు తమ పరిధిలో వున్న సచివాలయంలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎస్ఆర్ఐ కళాశాలలో...


మేడికొండూరు: విశదల సమీపంలోని ఎస్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమ వేడుకలు ప్రారంభించారు. జూన్ 21న నిర్వహించే యోగా డే సందర్భంగా వారం రోజులపాటు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని యోగాంధ్ర ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఎంపీడీఓ టి.చందన తెలిపారు. చందన మాట్లాడుతూ యోగా మనిషి జీవితానికి ఎంతో అవసరమని యోగా ద్వారా మానసిక ధైర్యాన్ని పెంచుకోవచ్చన్నారు. ఆరోగ్య పరిరక్షణకు యోగా సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ పాల్గొని యోగా అభ్యాసకులను అభినందించారు. తహసీల్దార్ హరిబాబు, ఈఓపీడీఆర్ డి.పూర్ణ శంకర్‌రావు, 150 మంది సభ్యులు యోగా శిక్షణలో పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్‌లో ..

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రామకృష్ణ మిషన్‌లో ప్రత్యేక యోగా శిక్షణా తరగతులను ఎంటీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంటీఎంసీ అధికారులు తెలిపారు. ఐదు రోజుల పాటు రామకృష్ణ మిషన్ స్కూల్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన యోగా మాస్టర్లచే తరగులను నిర్వహిస్తున్నామని, ఈ తరగతులకు హాజరయ్యే వారు ఆయా పరిధిలోని సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

సబ్సిడీపై సమీకృత పశువుల దాణా పంపిణీ

తెనాలి: రాష్ట్రప్రభుత్వ సమీకృత పశువుల దాణా పథకాన్ని రూరల్ మండల గ్రామం అంగలకుదురులో ప్రారంభించారు. గ్రామంలోని పశువైద్యశాలలో పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల సమీకృత దాణాను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రాథమికంగా ఒక్కో పాడిరైతుకు 50 కిలోల దాణాను అందజేశారు. దాణా అసలు ధర రూ.1110 కాగా, 50 శాతం సబ్సిడీపై రూ.555లకు రైతులకు పంపిణీ చేశారు. తెనాలి రూరల్ మండలానికి 25 మెట్రిక్ టన్నులు మంజూరు కాగా, అంగలకుదురు, కొలకలూరు, గుడివాడ, పెదరావూరు, తెనాలి పశువైద్యశాలలకు ఒక్కోదానికి 5 మెట్రిక్ టన్నుల చొప్పున కేటాయించినట్లు వివరించారు. గ్రామ సర్పంచ్ ఊసరపు లక్ష్మి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, వీరవల్లి మురళి, పశువైద్యురాలు డాక్టర్ సీహెచ్ అనూష, సంగంజాగర్లమూడి కాంపౌండర్ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.




బీజేపీ దుష్ట యత్నాలను తిప్పి కొట్టాలి



సమైక్యత సభ ర్యాలీని నిర్వహిస్తున్న పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు

మంగళగిరి టౌన్: మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ దుష్ట పన్నాగాలను ప్రజలంతా సంఘటితంగా తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమైక్యత సభ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పెహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడులను దేశవ్యాప్తంగా వామపక్షాలు, లౌకిక పార్టీలు, కాంగ్రెస్ పార్టీ ఖండించడం జరిగిందన్నారు. నిఘా వర్గాలకు ఉగ్రవాదుల చర్యలు ముందే తెలిసి హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోలేదన్నారు. ముస్లింలు అంటేనే ఉగ్రవాదులని బీజేపీ దాని అనుబంధ పరివార సంఘాలు మాట్లాడడం సబబు కాదన్నారు. మణిపూర్‌లో 250 మంది హత్యలు, అత్యాచారాలకు గురైన ఘటనలు ఉన్నాయని, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఇంతవరకు ఆ ప్రాంతాన్ని సందర్శించలేదని విమర్శించారు. సంఘ్ పరివార్ శక్తులు దేశాన్ని మతాల వారీగా విభజించడానికి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయుడికి విశేష పూజలు



మన్యుసూక్త హోమంలో పాల్గొన్న భక్తులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్ లో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక శ్రీహనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి విశేష పూజలు, మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 1108 అరటి పండ్లతో విశేష పూజాది కార్యక్రమాల్లో నిర్వహించారు.180 మంది భక్తులు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితులు నాగ మారుతి బృందం ఆగమోక్తంగా కార్యక్రమాలను జరిపారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అర్చకులు కిరణ్ కుమార్, సురేష్, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, దాతలు కారంశెట్టి అమర్‌నాథ్, తాతా శ్రీనివాసరావు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గాజుల రాజేంద్రప్రసాద్, మాజేటి వెంకటేష్, మద్దు హరీష్, బచ్చు లీలాప్రసాద్, వెచ్చ కృష్ణకిషోర్, గౌల్తి సోమ శేఖర్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.